క్లుప్తంగా

గ్రూపు-4 ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

దూద్‌బౌలి: ప్రభుత్వ సిటీ కళాశాలలో గ్రూపు-4 ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్‌కుమార్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలలో ప్రథమ శ్రేణి సాధించి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉన్న అభ్యర్థులు, ఓయూ క్యాంపస్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 31వ తేదీ లోపు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 040-27077929, 24071178లలో సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గోల్కొండ: చిన్నారుల జీవితాలలో కిండర్ గార్డెన్ రోజులు ఎంతో మధురమైనవని వీనస్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. శనివారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన ప్రీప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ అధ్యాపక బృందం, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిటీ సివిల్ కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

యాకుత్‌పురా: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 92 కేసులను పరిష్కరించి రూ.2 కోట్ల 38 లక్షల అప్పు బకాయిలు వసూలు అయ్యేలా కేసుల పరిష్కారం అయినట్లు సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా తెలియజేశారు. ఈరోజు జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్‌కు న్యాయమూర్తి రేణుకా యారా అధ్యక్షత వహించి పలు ప్రీ లిటికేషన్ కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాను మరణిస్తూ.. ఇతరుల జీవితాల్లో వెలుగులు



జైహింద్

గోల్కొండ: తాను మరణిస్తూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాడు ముత్యాల పోగు జైహింద్ (56). ఆసిఫ్‌నగర్‌లోని ఇందిరానగర్‌కు చెందిన ముత్యాలపోగు జైహింద్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. తన మరణాంతరం తన నేత్రాలను అవసరం అయిన వారికి ఇవ్వాలంటూ బతికుండగానే ప్రకటించాడు. శనివారం మృతి చెందిన ఆయన నేత్రాలను సక్ష్యం అనే స్వచ్ఛ సేవా సంస్థ వారు జైహింద్ నేత్రాలను సేకరించుకున్నారు. ఇదిలా ఉండగా గతేడాది ముత్యాల పోగు జైహింద్ ఒక కిడ్నీని ప్రాణాపాయంతో ఉన్న తన సోదరి కుమారుడికి దానం ఇచ్చాడు.

మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

దూద్‌బౌలి: మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రఖ్యాత ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఖైసర్ జమీల్ అన్నారు. శనివారం ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ పి.బాల భాస్కర్ అధ్యక్షతన జరిగిన మహిళా సాధికారిత సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళా శాస్త్రవేత్తలు ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని.. అయినా వెనుకంజా వేయకుండా కష్టపడి వాటన్నింటిని ఎదుర్కొనే ముందుకు సాగాలన్నారు. ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో మహిళలపై జరుగుతున్న హింసతో తల్లిదండ్రులు వారిని ఫోన్లు, కంప్యూటర్లకు దూరం పెట్టకుండా సైబర్ నేరాలకు గురి కాకుండా ఉండాలంటే ఏం చేయాలో నేర్పించాలన్నారు. మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును డాక్టర్ శ్రీదేవి సమన్వయం చేయగా.. డాక్టర్ నర్మద, డాక్టర్ కృష్ణవేణి, లతారాణి, డాక్టర్ యాదయ్య, డాక్టర్ చిత్తరంజన్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు

జియాగూడ: పురానాపూల్ చౌరస్తాలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కూల్చివేతలు జోరుగా కొనసాగుతున్నాయి. శనివారం పురానాపూల్ చౌరస్తాలో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్, కుల్సుంపురా పోలీస్ ఔట్‌పోస్టును కూల్చివేశారు. మూడు రోజులుగా పురానాపూల్ చౌరస్తా రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా చౌరస్తా నలుదిక్కుల వేగవంతంగా కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. కొన్ని సంవత్సరాల నుంచి చౌరస్తాలో తరచూ ట్రాఫిక్ సమస్య ఉండగా అక్రమ కట్టడాలు కూడా జోరుగా వెలిశాయి. గతంలో కూల్చివేతలు కొనసాగినప్పటికీ ఈసారి మాత్రం కూల్చివేతలు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి.

వామ్మో.. వైరల్ ఫీవర్

ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు



యూపీహెచ్‌సీ వద్ద ప్రజల వివరాలను సేకరిస్తున్న సిబ్బంది



యాకుత్‌పురాలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- వాతావరణంలో నెలకొన్న మార్పులతో పెరుగుతున్న రోగుల సంఖ్య
- జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న చిన్నారులు

యాకుత్‌పురా: ఇటీవల వాతావరణంలో నెలకొన్న మార్పులతో చాలా మంది ప్రజలు వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైద్య విధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ పరిధిలోని యాకుత్‌పురా-1,2, డబీర్‌పురా, దారుషిఫా, ఆజంపురా యూపీహెచ్‌లలో సాధారణ రోజుల కంటే ఎక్కువ మంది ప్రజలు జ్వరం, జలుబు, దగ్గు, శరీరక కండరాల నొప్పులతో బాధపడుతూ వైద్య చికిత్సల నిమిత్తం ఆస్పత్రులకు వెళ్తున్నారు. వైరల్ ఫీవర్ల నేపథ్యంలో వైద్య సిబ్బంది ఆస్పత్రికి వచ్చే వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్, చిన్నారుల వ్యాక్సినేషన్‌పై సర్వే నిర్వహిస్తున్నారు.

రోజురోజుకూ..

పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, స్థానిక క్లినిక్‌లు వద్ద ప్రజలు కన్పిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ 150 ఉండే ఓపీ చికిత్సల సంఖ్య, వైరల్ ఫీవర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో 200 వరకు నమోదవుతుందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. కుటుంబంలో ఒక్కరికి జ్వరం వస్తే అందరికీ వ్యాపిస్తుండటంతో సంఖ్య పెరుగుతుంది. వైరల్ ఫీవర్ల నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



వైరల్ ఫీవర్లతో బాధపడుతూ ప్రతిరోజూ రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రజలు, చిన్నారులు జ్వరంతో రెండు, మూడు రోజులుగా బాధ పడే వారు వెంటనే స్థానిక ఆస్పత్రుల్లో చికిత్సలు పొందాలి. ప్రస్తుతం వైరల్ ఫీవర్ల సంఖ్య పెరుగుతుండటంతో అధికారుల ఆదేశాల మేరకు బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే, చిన్నారులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వ్యాక్సినేషన్ వివరాలను సేకరిస్తున్నాం. సాధారణ చికిత్సలతో పాటు, కోవిడ్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్నాం. – డాక్టర్ ఆయేషా ముదాషీర్, యాకుత్‌పురా-2 యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి

మసీదుల వద్ద ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సలావుద్దీన్ లోధి, పుస్తె శ్రీకాంత్

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని చార్మినార్ నియోజకవర్గంలోని అన్ని మసీదుల వద్ద ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి కోరారు. ఈ మేరకు గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ పరిధిలోని సర్కిల్-9లోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలతో పాటు డ్రైనేజీ ఓవర్ ఫ్లో, వీధి దీపాల ఏర్పాటు, నిరంతర తాగునీటి సరఫరా తదితర సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకునేటట్లు ఆదేశాలు జారీ చేయాలని మేయర్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు. చార్మినార్ నియోజకవర్గంలోని మక్కా మసీదుతో పాటు చౌక్ మసీదు, దారుషిఫా జమా మసీదు, పురానీహవేలిలోని ఏకానా మసీదు, శాలిబండలోని వజీర్ అలీ మసీదు, దారుషిఫాలోని ఇబాదత్ ఖానా మసీదు, కోట్లా ఆలిజాలోని జాఫ్రి మసీదు, దారుషిఫాలో అలావా సర్తుకా, పురానీహవేలిలోని బాగ్ ఇ అలీ మసీదు, హుస్సేనీఆలం దర్గా మూసా ఖాద్రీ తదితర మసీదుల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో రెండుసార్లు క్లీనింగ్ చేయాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో పుస్తె శ్రీకాంత్ కూడా ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం



ఎంపీ బీబీ పాటిల్, రాజీవ్‌సాగర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే ప్రజల సంక్షేమం కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. న్యూ ఢిల్లీకి వెళ్లిన ఆయన ఎంపీ బీబీ పాటిల్, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పథకాలు పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు.

దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ



బొంతు రామ్మోహన్ దంపతులను సత్కరించిన అరుణ్‌కుమార్, లహరి

అబిడ్స్: తెలంగాణ తరహాలో దేశం నలుమూలలా బీఆర్ఎస్‌కు ఎంతో ఆదరణ లభిస్తుందని జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. రాష్ట్ర కురుమ యూత్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు తూంకుంట అరుణ్‌కుమార్, తూంకుంట లహరి బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవిలను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రం నలుమూలలా బీఆర్ఎస్ భారీ ఎత్తున విజయం సాధిస్తుందన్నారు. తూంకుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ పథకాలతోనే తిరిగి విజయం సాధిస్తామన్నారు.

తిరుపతి శివ కుమార్‌కు సన్మానం



తిరుపతి శివ కుమార్‌ను సన్మానిస్తున్న కె.ఎస్.ఆనంద్‌రావు తదితరులు

గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నియమితులైన తిరుపతి శివ కుమార్‌కు శనివారం పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు పాతనగర మున్నూరు కాపు సంఘం సలహాదారులుగా కె.ఎస్.ఆనంద్ రావు, కొండూరు వినోద్, బి.జానకీరాం, కె.గోవింద్ రాజ్, కె.సురేశ్ బాబు తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సలహాదారులుగా నియమితులైన కె.ఎస్.ఆనంద్‌రావు నూతన అధ్యక్షుడు తిరుపతి శివ కుమార్‌ను శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఆనంద్‌రావు మాట్లాడుతూ.. త్వరలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారితో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

శారదా విద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్, శిఖా గోయల్, రాణిరెడ్డి

చాంద్రాయణగుట్ట: అలియాబాద్‌లోని శారదా విద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన వేడుకలకు తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. గౌరవ అతిథిగా ఉమెన్ సెఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ అండ్ హెడ్ శిఖా గోయల్, ప్రత్యేక అతిథిగా సాక్షి మీడియా కార్పొరేట్ ఎఫైర్స్ డైరెక్టర్ రాణిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారదా విద్యాలయ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శారదా విద్యాలయ ట్రస్టీ, సింథోకెమ్ ల్యాబ్స్ చైర్మన్ జయంత్ ఠాగోర్, శారదా విద్యాలయ సెక్రటరీ రామ్ మాదిరెడ్డి, కరస్పాంటెండెంట్ జ్యోత్స్న అంగారా సైతం పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా క్రీడా మైదానాన్ని సైతం ప్రారంభించారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళనలో పాల్గొన్న చింతల రాంచంద్రారెడ్డి

గన్‌ఫౌండ్రీ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని మాజీ శాసన సభ్యుడు చింతల రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పేపర్ లీకేజీకి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మొదటి నుంచి కూడా నిరుద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ నగర సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండుయాదవ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ఓబీసీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

ఐక్యతను పెంచేందుకే శ్రీరామనవమి శోభాయాత్ర



శ్రీరాముడి విగ్రహాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: హిందూ సంస్కృతి సంప్రదాయాలను చాటేందుకు, హిందూవులలో ఐక్యతను పెంచేందుకు శ్రీరామనవమి శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఈనెల 30న శ్రీరామ నవమి శోభాయాత్ర నిర్వహించేందుకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాది మంది జనంతో శోభాయాత్ర ధూల్‌పేట రాణి అవంతిబాయినగర్ నుంచి కోఠిలోని హనుమాన్ టేక్డీ వరకు కొనసాగుతుంది. ఈ శోభాయాత్రలో శ్రీరాముడి విగ్రహంతో పాటు పలు దేవుళ్ల విగ్రహాలను ప్రదర్శిస్తారు. విగ్రహాల తయారీ దాదాపు పూర్తికావస్తుంది.

26 నుంచి రసరంజని నాటకాల ప్రదర్శన



నాంపల్లి: తెలుగు ప్రేక్షకుడిని టికెట్‌కొని ప్రదర్శన చూసే విధంగా అలవాటు చేయాలనే లక్ష్యంతో 1993 మార్చిలో రసరంజని సంస్థను నాటక ప్రియులు, రంగస్థల ప్రముఖులు ప్రారంభించారు. మూడు దశాబ్దాలుగా నిరాటంకంగా ప్రేక్షకుల ఆదరణతో రసరంజని సంస్థ ముందుకుసాగుతుంది. ఈ మేరకు శనివారం రస రంజని సంస్థ జరుపుకోబోతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాల వివరాలను ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కేవీ.రమణ మాసబ్‌ట్యాంక్ వద్ద నున్న ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకర్ల సమావేశంలో నాటకాల పోస్టర్ ఆవిష్కరణ సభలో ప్రసంగించారు. ఈనెల 26, 27, 28వ తేదీల్లో రవీంద్రభారతి ప్రధాన వేదికపై మూడురోజులు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసరంజని వారిచే సిరి మింగిన వెలగపండు, మిత్ర క్రియేషన్ వారిచే ది ఇంపోస్టర్స్, కర్టెన్ కాల్ థియేటర్స్ వారిచే పెట్రోమాక్స్ పంచాయితీ నాటకాలు వరుసగా ప్రదర్శితం అవుతాయని తెలిపారు. ప్రారంభ సభకు విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర పా ల్గొంటారని, కళా పోషకుడు సారిపల్లి కొండలరావు సభకు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. దుగ్గిరాల సోమేశ్వరరావు, మోహన్‌సేనాపతి, నటరాజ్, నారాయణ స్వామి, అరుణ్, కామేశ్వర శర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల పరిధిలోని షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను శనివారం రెయిన్‌బజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 90 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో బాధపడే ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లపై అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న పేదలు స్వయం ఉపాధి పథకాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, తలాబ్‌చంచలం, డబీర్‌పురా, సంతోష్‌నగర్, మొఘల్‌పురా, పత్తర్‌గట్టి కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనా బేగం, ఆలంధార్ వాలా జాహి, ముజఫర్ హుస్సేన్, నస్రీన్ సుల్తానా, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, చార్మినార్ తహసీల్దార్ ఎస్.పి.ఆర్.మల్లేష్ కుమార్ పాల్గొన్నారు.

సిమెంట్ కుర్చీల వితరణ



సిమెంట్ కుర్చీలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా యూనియన్, అసద్‌అన్వార్ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిరంతరం సంయుక్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భారత్ స్కౌట్స్ స్కూల్‌లో పిల్లల కోసం 5 సిమెంటు కుర్చీలను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి సీమా ముజీబ్, కేఆర్.రాజ్‌కుమార్, బి.శంకర్, ఖురేషి, ముస్తఫా, మహ్మద్ వహీద్, స్కూల్ సెక్రెటరి వరలక్ష్మీ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని బల్దియ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో పూర్తి కావాల్సిన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. రంజాన్ నెల వచ్చే వారమే ప్రారంభమవుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రంజాన్ మాసంలో సాయంత్రంకాగానే మసీదుల వెళ్లే వారితో రోడ్లు రద్దీగా ఉంటాయన్నారు. అయితే సమతాకాలనీ, గుల్షన్ కాలనీతో పాటు ఎన్నో కాలనీలలోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, వాటికి ప్యాచ్ వర్కులు చేయించాలని ఆయన సూచించారు.



విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

గోల్కొండ: రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మహ్మదీ లైన్స్‌లోని ఒవైసి కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. రంజాన్ నెల రోజులు సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 వరకు మార్కెట్‌తో పాటు మసీదుల పరిసరాలు సందడిగా ఉంటాయన్నారు. పండ్ల వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల ముందు ఎంతో సందడిగా ఉంటుందన్నారు. అయితే మసీదులు, ప్రధాన రహదారులు బస్తీల అంతర్గత వీధులలో వెలగని విద్యుత్ దీపాలు ఎన్నో ఉన్నాయని, వాటికి మరమ్మతులు నిర్వహించాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పేలుడు సంభవించకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు ఆయిల్‌ను మార్చాలన్నారు. ఫిర్యాదులపై స్పందించడానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచాలని ఆయన అన్నారు. విద్యుత్ కార్యాలయాల వద్ద సలహాలు, సూచనలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బదర్ ఉద్దీన్, హారూన్ ఫర్హాన్ తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పురస్కార గ్రహీతలతో బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం, శ్రీనివాస్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో శ్రీసాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది రాష్ట్ర స్థాయి బాలరత్న పురస్కారాలు, ఉపాధ్యాయ, స్త్రీశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని కోరారు. అనంతరం పలువురు నృత్యగురువులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి, పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ అధ్యక్షురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ పాల్గొన్నారు.

బాబురావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



వాటర్‌వర్క్స్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఇటీవల మీరాలం ట్యాంక్‌లో పడి ప్రమాదవశాత్తు మృతిచెందిన వాటర్‌వర్క్స్ ఉద్యోగి బాబురావు కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జియాగూడ ఇమాంపురా నవభారత సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం రెడ్‌హిల్స్‌లోని వాటర్‌వర్క్స్ ఎండీ దానకిశోర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 14న మీరాలం వాటర్ ఫిల్టర్‌లో ప్రమాదంలో ఇమాంపురా నివాసి ఉద్యోగి బాబురావు ప్రమాదవశాత్తు చనిపోయాడని ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వైస్ జస్వంత్ కుమార్, కోశాధికారి మహేష్‌బాబు, నరేష్, డాక్టర్ సుదర్శన్, బీజేపీ నాయకులు రమేష్ చౌగ్లే తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛభారత్



ఆస్పత్రి రోడ్డును శుభ్రం చేస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆస్పత్రికి వచ్చే వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే వీలుంటుందని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి ముందు గల రోడ్డుతో పాటు ఆస్పత్రిలోని రోడ్లను ఊడ్చారు. అంతేకాకుండా ఆస్పత్రి గార్డెన్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చెత్తను వేయడానికి వేర్వేరుగా చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయడానికి ప్రత్యేకంగా డబ్బాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం బడాబజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి

గన్‌ఫౌండ్రీ: కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉద్యోగపని కాకుండా స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందర్‌రెడ్డి అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో కేంద్ర విద్యాశాఖ సౌజన్యంతో విద్యార్థులకు సామాజిక బాధ్యత, సుస్థిరత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధి, స్వయం ఉపాధి అనే అంశంలో తమ కళాశాలను భాగస్వామ్యం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సదస్సు సభ్యులు శరత్‌చంద్ర, నవీన్‌కుమార్, కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి, మమత, ప్రశాంత్ పాల్గొన్నారు.